క్లుప్తంగా

నగరి రూరల్ సీఐగా భాస్కర్



నింద్ర: నగరి రూరల్ సీఐగా భాస్కర్ శనివారం నింద్రలోని కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉన్న సీఐ వైఎస్ఆర్ జిల్లాకు బదిలీ కావడంతో శ్రీసిటీలో విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌ను నగరి రూరల్ సీఐగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి రూరల్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడుతామని తెలిపారు.

రేపు శ్రీకృష్ణ జయంతి వేడుకలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట శ్రీకృష్ణ సమేత ద్రౌపదీ ధర్మరాజుల స్వామివారి ఆలయంలో 26న సోమవారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాధారెడ్డి శనివారం తెలిపారు. స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు, భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఈవోపీఆర్‌డీకి సన్మానం



ఈవోపీఆర్‌డీని సన్మానిస్తున్న అడ్వొకేట్ బాబు

విజయపురం: మండలం ఈవోపీఆర్‌డీ సురేంద్రకుమార్‌ను వైఎస్ఆర్ సీపీ మండల కార్యదర్శి, లీగల్ అడ్వైజర్ బాబు సన్మానించారు. శనివారం పన్నూరు సచివాలయంలో ఆయన్ను సన్మానించి, అభినందించాడు. పార్టీలకు అతీతంగా అందరికీ న్యాయం చేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీలో జాతీయ కార్యక్రమాలపై సమీక్ష



వైద్యసిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న క్షయ నివారణ అధికారి

నగరి: పీహెచ్‌సీలో నిర్వహించే జాతీయ కార్యక్రమాలపై జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ సమీక్షించారు. శనివారం మండలంలోని బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని, ఆస్పత్రిలో నిర్వహించే కాన్పులను, వివిధ జాతీయ కార్యక్రమాలపై వైద్యసిబ్బంది, ఆశాలతో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి రికార్డులను తనిఖీ చేశారు. 60 సంవత్సరాలకు పైబడిన వారికి బీసీజీ వ్యాక్సినేషన్ ప్రాముఖ్యతను ప్రజలకు అవగాహన కల్పించి అర్హులందరికీ టీకా వేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రమేష్, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన

పుత్తూరు: ఎస్సీ, ఎస్టీ ఉపకులాల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పుపై వడమాలపేటలో శనివారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ కులాల వర్గీకరణ సరికాదని, కులాలను విడదీయరాదని అన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జయంత్ బాబు, నాయకులు వెంకటేష్, నందయ్య, సాంబవినోద్, గణేష్‌కుమార్, నితీష్, జ్యోతిప్రకాష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేక పూజలు



ఆలయ శిఖరంపై మహా కుంభాభిషేకం

కార్వేటినగరం: గ్రామ దేవత శ్రీబంగారమ్మ ఆలయంలో శనివారం మహా కుంభాబిషేకం వేడుకలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం వేద పండితులు గణపతి హోమం నిర్వహించారు. పరివార దేవతా హోమం, మూర్తి హోమం, మహా పూర్ణాహుతి హోమం నిర్వహించారు. 10 గంటలకు హోమం నిర్వహించిన కుటుంబ సభ్యులను వేద పండితులు ఆశీర్వదించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కె.ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం

రాత్రిపూట వైద్యులకు రక్షణ కల్పించాలి



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సెక్యూరిటీ గార్డులను నియమించాలి. ముఖ్యంగా రాత్రి పూట పని చేసే వైద్యులకు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వారికి మనోధైర్యం కల్పించాలి. పీహెచ్‌సీలలో విశ్రాంతి గదులు లేక డాక్టర్లు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. డాక్టర్లకు భద్రత కల్పించాలి. ఎవరైనా దాడులు చేస్తే కఠినంగా శిక్షించేలా చట్టాల్లో మార్పులు తేవాలి. దీనిపై పాలకులు, అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

- దుర్గా, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



మహిళా వైద్యులకు భద్రత ముఖ్యం




కోల్‌కతా ఘటనతో డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రుల్లో సెక్యూరిటీ కల్పించాలి. ప్రభుత్వం డాక్టర్లు, ఆసుపత్రులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎవరైనా దాడులు చేసినా కఠిన శిక్షలు ఉండేలా చట్టాల్లో మార్పులు చేయాలి. సుప్రీంకోర్టు సూచన మేరకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. తద్వారా వైద్యులు, సిబ్బందికి మనోధైర్యం కల్పించాలి.. ఆస్పత్రి సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలి.

- మనోజ్ఞ, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

దోమకాటు.. ప్రాణాంతకం

- నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు
- దోమ తెర వాడండి...ఆరోగ్యంగా ఉండండి
- వివిధ వ్యాధుల వ్యాప్తికి దోమే కారకం

విజయపురం: ఇటీవల వస్తున్న వ్యాధుల్లో చాలావరకు దోమకాటుకు సంబంధించినవే. దోమ అంత ప్రమాదకరమైంది. దోమలతో సోకే వ్యాధుల గురించి తెలుసుకుందాం... దోమకాటు చాలా ప్రమాదం. లేనిపోని రోగాలన్నీ దోమల ద్వారానే వస్తున్నాయని అనేక అధ్యయనాలు తెలిపాయి. పరిశుభ్రత లోపం వల్లే దోమలు రోజురోజుకూ వృద్ధి చెందుతూ తమ ఉనికిని చాటుతున్నాయి. హత్యలు, దాడులతో మరణిస్తున్నవారి కంటే దోమలతో వచ్చే వ్యాధుల కారణంగా మరణిస్తున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంటున్నది.



మెదడువాపు

క్యూలెక్స్ ఆడదోమ కుట్టడంతో ఈ వ్యాధి సంక్రమిస్తుంది. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది.
లక్షణాలు: ఆకస్మిక జ్వరం వచ్చి తీవ్రత ఎక్కువ కావడం, విపరీతమైన తలనొప్పి, వాంతులు రావడం, అపస్మారక స్థితికి లోనుకావడం, శరీరంలో ఏదో ఒకపక్క పక్షవాతానికి గురికావడం, ఫిట్స్ రావడం.

దోమకాటుతో వచ్చే వ్యాధులు -లక్షణాలు

- **మలేరియా** : ఆడ అనాఫిలస్ దోమ కుట్టడంతో మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియాతో బాధపడుతున్న రోగిని దోమ కుట్టడంతో దాని కడుపులోకి వ్యాధికారక పరాన్నజీవి ప్రవేశించి అక్కడ పెరుగుతుంది. ఇదే దోమ మరో వ్యక్తిని కుట్టినప్పుడు ఆ వ్యక్తి రక్తంలోకి చేరి మలేరియాకు కారణమవుతుంది.
- **లక్షణాలు:** చలి, వణుకుతో జ్వరం రావడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, జ్వరం విడిచి విడిచి వస్తూ ఉంటుంది.
- **డెంగీ** : పగటి సమయంలో కుట్టే ఏడీస్ ఆడ దోమల ద్వారా డెంగీ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది సాధారణ వైరస్ జ్వరం, ఎముకలు, కండరాలు, కీళ్లనొప్పులతో జ్వరం మొదలవుతుంది. ప్లేట్లెట్స్ అమాంతం తగ్గిపోతాయి.
- **లక్షణాలు:** హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండరాలలో భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండిపోవడంతో పాటు చిగుళ్లు, ముక్కు ద్వారా రక్తం వస్తుంది.
- **చికున్ గున్యా:** ఏడిస్ ఈజిప్టై దోమలతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చేతులు.. కాళ్లలో.. కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. జ్వరంతో మనిషి బలహీనంగా ఉంటారు. లక్షణాలు: తలనొప్పి, వాంతులు, వికారంతోపాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు, సరిగా నిలబడలేకపోవడం.
- **ఫైలేరియా** : దీనిని బోదకాలు అని కూడా అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోదకాలు సోకుతుంది. లక్షణాలు: తరచూ జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిళ్లలు కట్టడం, వెన్నుపాము దగ్గరి నుంచి అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది. అవయవాలకు వాపు, కాళ్లు, చేతులు, స్తనాలు, వరిబీజం, బుడ్డ, జ్ఞానేంద్రియాలు పాడవుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డెంగీ, చికున్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను నివారించాలంటే వైద్యం ఇంటి నుంచే ప్రారంభం కావాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే తప్ప దోమల నియంత్రణ పూర్తిగా సాధ్యం కాదు. కాబట్టి ఎవరికి వారు ఇంటి లోపల దోమలు లేకుండా చూసుకోవడమే మంచి మార్గం.

- **దోమతెర** : రాత్రిలో పడుకొనే ముందు దొమతెర వాడాలి. లేదంటే శరీరం పూర్తిగా కప్పబడేటట్లు దుస్తులు వేసుకోవాలి.
- **వేపనూనె:** వేపనూనె, కొబ్బరినూనెను 1:1 నిష్పత్తిలో తీసుకొని చర్మంపై రాసుకోవాలి. వేప వాసన చూసి దోమలు పారిపోతాయి. వేపలో యాంటీ బ్యాక్టీరియా, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్, యాంటీ ప్రోటోజోల్ గుణాలు ఉన్నాయి.
- **కాఫీ గ్రౌండ్స్:** ఇంటి సమీపంలో నీరు నిలిచిన చోట దోమలు గుడ్లు పెట్టి ఉంటాయి. కాఫీ డికాషన్ చల్లడం ద్వారా అందులోని దోమల గుడ్లు నీటిపైకి చేరతాయి. అవి ఆక్సిజన్‌కు లోనయి దోమలుగా మారకుండానే నిర్వీర్యమవుతాయి. నీటిలో దోమలు గుడ్లు కూడా పెట్టవు.
- **నిమ్మనూనె:** దోమల నివారణకు యూకలిప్టస్, లెమన్ ఆయిల్‌ను చర్మంపై రాసుకోవాలి. దీనివల్ల మన చర్మానికి ఎలాంటి హాని ఉండదు. వీటిలో ఉండే సినోల్ రసాయనం యాంటీసెప్టిక్ కీటక నివారిణిగా పనిచేస్తుంది.
- **కర్పూరం:** చీకటి పడుతున్న వేళలో ఇంటి తలుపులు మూసేసి కర్పూరం వెలిగించండి. 20 నిమిషాల తర్వాత తలుపు తెరిస్తే దోమలు కనిపించవు. కర్పూరం మంచి కీటక నివారిణిగా పనిచేస్తుంది.

కేసుల పరిష్కారంలో చొరవ చూపాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘువేంద్ర

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టులో సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పోలీసులు చొరవ చూపాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘువేంద్ర కోరారు. శనివారం కోర్టులో పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి లోబడిన క్రిమినల్ కేసుల పరిష్కారంలో పోలీసులు కీలక పాత్ర పోషించాలన్నారు. విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని తెలిపారు. పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించబడే విధంగా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ, డీఎస్పీ రవికుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం



చెవిరెడ్డిని కలిసి సత్కరిస్తున్న హేమసుందర్‌రెడ్డి, మురళీరెడ్డి

వెదురుకుప్పం: వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భరోసా ఇచ్చినట్లు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతిలోని చెవిరెడ్డి నివాసంలో ఎంపీపీ నాగరాణి భర్త, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ సభ్యుడు తోకల మురళీరెడ్డి కార్యకర్తలతో కలిసి చెవిరెడ్డిని కలిశారు. ఆయన్ను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు ధైర్యం చెప్పినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసి, దాడులు చేయిస్తున్నట్లు చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో తాము అన్ని విధాలా తోడుగా నిలుస్తామని చెవిరెడ్డి స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. రామచంద్రాపురం మండలం నెమలగుంటపల్లె గ్రామానికి చెందిన తిరుచానూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాణెమ్మ భర్త దేవరాజులురెడ్డి ఉన్నారు.


ఘనంగా కానగలమ్మ ఊరేగింపు




శ్రీకానగలమ్మ అమ్మవారు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శివాలయం వీధిలో వెలసి ఉన్న శ్రీకానగలమ్మ అమ్మవారు శనివారం పురవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు భక్తులు సమర్పించిన పట్టువస్త్రా, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం యాదవుల ఆచారం ప్రకారం కొలుపులో భాగంగా హరికథా కాలక్షేపం నిర్వహించారు. రాత్రి ఉభయదారులు సమర్పించిన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి, ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పుర వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధ్యక్షుడు గురుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంపులపై ఆకస్మిక దాడి



కరకంతాపురంలో ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న సీఐ, తహసీల్దార్



గుట్టల నడుమ రహస్యంగా ఉంచిన ఇసుక డంప్ వద్ద ప్రభుత్వాధికారులు

నగరి: మున్సిపల్ పరిధిలోని కరకంతాపురం, కీలపట్టు శివారులో అక్రమంగా డంప్ చేసి ఉంచిన ఇసుక నిల్వలను సీఐ మహేశ్వర్, తహసీల్దార్ రవికుమార్ శనివారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు కరకంతాపురం వేల్‌మురుగన్ క్రషర్స్ సమీపంగా మామిడితోటల మధ్య, గుట్టల వద్ద, కీలపట్టు శివారు వైట్‌హౌస్ కంపెనీ సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న ఇసుక డంపులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆయా ప్రాంతాల వీఆర్‌ఓలకు పట్టుబడిన ఇసుక రక్షణ బాధ్యతలను కేటాయించారు. ఈ సందర్భంగా సీఐ, తహసీల్దార్ మాట్లాడుతూ డంప్‌లలో పట్టుబడిన ఇసుక సుమారు 10 టిప్పర్లు ఉంటుందన్నారు. నగరి ప్రాంతంలో ప్రభుత్వం ఎక్కడా ఇసుక డంపులకు అనుమతి ఇవ్వలేదన్నారు. నదిలో ఇసుకను తరలించడం, డంప్ చేసి ఉంచడం నేరమన్నారు. ఇసుక డంప్ చేసిన వారి వివరాలు త్వరలో కనుగొంటామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై సమాచారం అందిస్తే వెంటనే చర్యలు చేపడతామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. పట్టుబడ్డ ఇసుకను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వినియోగిస్తామన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన



కొత్త విధానంలో బోధిస్తున్న ఏటీఆర్ఐఏ యూనివర్సిటీ బృందం

పాలసముద్రం: చిత్తూరు ప్రాజెక్టు ఏటీఆర్ఐఏ యూనివర్సిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం శనివారం తిరుమలరాజుపురం ప్రాంతాల్లో రైతులు, ప్రజలకు విద్య, ఆరోగ్యం, సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించారు. తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఏటీఆర్ఐఏ చైర్మన్ సుందరరాజు, కో ఆర్డినేటర్ విజయ్ సింహా విద్యార్థులకు కొత్త ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా బోధనా ప్రాక్టీస్ నిర్వహించారు. వివిధ గ్రేడ్ విద్యార్థులను వారి స్థాయిని బట్టి ప్రశ్నావళి ద్వారా స్థాయి నిర్ధారణ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ సుధాకర్, గంగరాజు, బాలరాజు, నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు మురుగదాస్, ఉపాధ్యాయులు సుధాకర్, వాసు, శ్రీనివాసులు, సుబ్బలక్ష్మి, ఉషారాణి, వెంకటేష్, పాల్గొన్నారు.

దీనస్థితిలో కిడ్నీ బాధితురాలు



రెండేళ్లుగా మంచంపై ఉన్న సుబ్బమ్మ

విజయపురం: మండలంలోని విజయపురం దళితవాడకు చెందిన సుబ్బమ్మకు రెండేళ్లకు క్రితం కిడ్నీ పాడైంది. దీంతో ఆమె మంచానికే పరిమితమయ్యారు. ఆమె అత్త సంజీవమ్మకు వచ్చే పింఛన్‌తో ఇన్ని రోజులు కుటుంబం గడిచింది. అయితే ఆమె కూడా కళ్లు, చేతిలో రేఖలు పని చేయకపోవడంతో పింఛన్ కూడా ఆగిపోయింది. దీంతో ఒక్క పూట గడవడం కూడా కష్టంగా మారింది. కనీసం ఆసుపత్రికి వెళ్లడానికి కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు తమ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రుణం అందించండి

విజయపురం: జగనన్న ఇళ్ల నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు డ్వాక్రా సంఘం ద్వారా రుణం మంజూరు చేయాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. శనివారం మండల కార్యాలయంలో డ్వాక్రా సంఘం లీడర్, ఏపీఎం, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అసంపూర్తిగా ఆగిపోయిన జగనన్న ఇళ్లను వెంటనే గుర్తించాలన్నారు. వాటిని మళ్లీ తిరిగి కట్టడానికి లబ్ధిదారులకు డ్వాక్రా సంఘం తరఫున రూ.20 నుంచి రూ.30 వేలు వరకు రుణం మంజూరు చేయించాలన్నారు. తీసుకున్న రుణంతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు



చార్వాకానిపల్లిలో వేరుశనగ పంట సాగుపై పొలంబడి

కార్వేటినగరం: రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చిత్తూరు డివిజన్ ఏడీఏ ఉమా అన్నారు. శనివారం మండల పరిధిలోని చార్వాకానిపల్లిలో వేరుశనగ పంటపై పొలంబడి కార్యక్రమంలో రైతులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు శాస్త్రీయ పద్ధతులతో సమగ్రమైన యాజమాన్య చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం రైతు శిక్షణా కేంద్రం ఏఓ ప్రసన్న మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, మందులు, కలుపు మందుల ద్వారా అనేక అనార్థాలు, వ్యాధులు సంభవిస్తాయని అన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను పండించి భావితరాలను కాపాడాలని సూచించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి స్వర్ణలత మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో వేరుశనగ పంట బెట్టకు గురవుతుందని, తట్టుకోవడానికి రెండు శాతం యూరియా ద్రావణం పిచికారీ చేయాలని పేర్కొన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై చార్వాకానిపల్లి, సీఎస్ అగ్రహారం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుధాకర్‌నాయుడు, లక్ష్మి, ధనలక్ష్మి, హరికృష్ణారెడ్డి, ఆర్బీకే సిబ్బంది ఢిల్లీబాబు, సంధ్యక్రాంతి, సుప్రియ పాల్గొన్నారు.

దుస్థితిలో గ్రామీణ రోడ్లు



దుస్థితిలో ఉన్న ఎస్టీ కాలనీ రోడ్డు

వెదురుకుప్పం: చినుకు పడితే చాలు గ్రామీణ రోడ్లు మురుగు గుంటలను తలపిస్తోంది. వర్షపు నీళ్లు రోడ్డుపై నిల్వ ఉండడంతో రొచ్చురొచ్చుగా మారి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. వెదురుకుప్పం ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డు ఇదే విధంగా ఉంది. తరతరాలుగా గ్రామానికి మట్టి రోడ్డు కావడంతో దాన్ని బాగు చేసే నాథుడే లేడని ఎస్టీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెదురుకుప్పం గ్రామం నుంచి ఎస్టీ కాలనీ వరకు 2 కిలోమీటర్ల వరకు ఉన్న రోడ్డు గోతులు ఏర్పడి దుస్థితికి చేరింది. వర్షాలకి వాగును తలిస్తుండడంతో రాకపోకలు సాగించ లేక అసౌకర్యానికి గురవుతోంది. గ్రామీణ రోడ్లను బాగు చేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం చెబుతున్నా తమ గ్రామానికి వెళ్లే రోడ్డు వేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అధ్వానంగా ఉన్న రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించండి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్

శ్రీరంగరాజపురం: క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. మండలంలో ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి వాటి కట్టడికి చర్యలు చేపట్టాలన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కచ్చితంగా వేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ప్రసవాలు జరిగేటట్లు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు ప్రతి ఒక్కరు వేసుకోవాలని ఆదేశించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, డాక్టర్ గౌరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



రైతులకు శిక్షణ ఇస్తున్న ఏడీఏ



రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారి

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేసి, వాటి ఆధారంగా ఎరువులు వాడాలని చిత్తూరు వనరుల శిక్షణ కేంద్రం ఏడీఏ నాగపద్మిని అన్నారు. మండల కేంద్రమైన నింద్రలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించి లోపాలను గుర్తించి, అవసరమైన పోషకాలను వాడాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారి తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం : రైతులు భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. శనివారం కాళికాపురం రైతులకు భూసార పరీక్ష, వరి, వేరుశనగ పంట సాగు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు శాస్త్రవేత్త సంధ్యారాణి గ్రామ రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఏవో రజినికుమారి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

సంఘమిత్రలు బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్

పాలసముద్రం: సంఘమిత్రాలు, వీఓ లీడర్లు బాధ్యతగా పనిచేసి గ్రూప్‌లను ఏగ్రేడ్‌లో ఉంచాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్ తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ రుణాలను సక్రమంగా వాయిదాల ప్రకారం కట్టించాల్సిన బాధ్యత సంఘమిత్రాలపై ఉందన్నారు. స్త్రీనిధి, ఉన్నతి రుణాలు కూడా సక్రమంగా కట్టుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా కట్టుకుంటే ఒక్కొక్కరికి లక్ష యాభైవేలు వరకు రుణాలు ఇస్తామని తెలిపారు. ఇస్తున్న రుణాలను తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్రాలు మురగయ్య, మంజుల, శోభ, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ, రుక్మిణీ వేషధారణల్లో విద్యార్థులు



శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు

నగరి: మండల పరిధిలోని నంబాకం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ, రుక్మిణి వేషధారణలో వచ్చిన విద్యార్థులు అందరినీ అలరించారు. గ్రామస్తులు కౌసల్య, వరదయ్య విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి స్వీట్లు, వడ, అప్పడాలు, అరటిపండు అందించారు. వేషధారణలో మెప్పించిన విద్యార్థులకు ప్రశంసలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా ముందస్తు కృష్ణాష్టమి

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహా విద్యా సంస్థలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గొల్లభామల వేషధారణలో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు కూడా ఆకట్టుకున్నాయి. కళాశాల డైరెక్టర్ దిలీప్, డైరెక్టర్లు ధనుంజయరెడ్డి, పురుషోత్తం, వెంకటేష్, ఉపాధ్యాయులు చంద్రప్రియ, జమున, సౌమ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.